


# ఇది నిజంగా కథే!

ఇచ్ఛాపురపు రామచంద్రం

బందరు రోడ్ తెగ తిరిగి—లబ్బీపేట వచ్చేసరికి రంగనాథం కాళ్ళు పీకులు పెట్టసాగాయి.

అతని శ్రీమతికి ముక్కుమీద చిరు చెమటలు పోశాయి. వెరశి-యిద్దరికీ ఆర్. టి. సి. మీద అతి కోపం వచ్చింది.

"ఇది ప్రజాస్వామ్యం కాదు-" వుండ బట్టలేక అనేశాడు పెదవి కొరుక్కుంటూ, పేద వాడి కోపం పెదవికి చేటు అని రుజావు చేస్తున్నట్లు.

"అవునని నే ననను. ప్రజాప్రభుత్వం అయితే ఈ పాటికి హాయిగా మన వూరి బస్సులో ఉండేవాళ్ళం. అయినా మన ప్రభుత్వం మరీను. ఓ బస్సుకి రిపేరొచ్చి షెడ్‌కి పోతే స్పేరు బస్ వేసే పాటి సమర్థత లేదూ?" కసిగా అంది విమల-రంగనాథం అర్ధాంగి. "ఆర్. టి. సి. కీ యిండియన్ గవర్నమెంట్‌కీ యిది తీరని అవమానం. మాయని మచ్చ. ఇంకా..."

"సమర్థత లేక కాదు. మన ప్రభుత్వం యిటువంటి చిన్న చిన్న విషయాలు పట్టించుకో దల్చుకోలేదు. మెయిల్లో మరో రెండు ఫస్ట్ క్లాస్ డబ్బాలు తగిలించడానికైతే త్వరపడుతుంది కానీ థర్డ్ క్లాస్ పెట్టెల విషయం వస్తే ససేమిరా అనేస్తుంది. అయినా యీ రోజులు కారు నడకల వారివి కాని కాలి నడకల వారి సొంతమాత్రమూ కావు."

"మనం మాత్రం బొత్తిగా కాలి నడకల వాళ్ళమా? ఆర్. టి. సి. బస్సు నడకల వాళ్ళం."

"ఆ! ఉందిగా మహా గొప్ప బస్సు! రేపు ఉదయం వరకూ జాగరం చేస్తే."

"ఆ మాట కొస్తే జాగరం మహా రంజుగా వుంటుంది. రెండు షోలూ చూసి-ఏ హోటల్లోనో భోజనమూ నిద్రా చూసుకుంటే."

"స్టాప్!" అరిచాడు రంగనాథం. నీ కోరికల గుర్రాలకి కొంచెం కళ్ళాలు బిగించు. అర్ధాంగీ, నీ మొగుడు ఒట్టి బడి పంతులు. నువ్వు—బీద బడి పంతులి భార్యవి. ఈ చేదు నిజం మరచిపోకు."

ముఖం ముడుచుకుంది విమల.

అది గమనించకుండా అనేశాడు రంగనాథం. "టికెట్ ఛార్జీలు ప్లస్ రెండు భోజనాలు, కొంచం చిల్లరా—అంతే మన పాకెట్ కపాసిటీ. తర్వాత నీ యిష్టం. నా ఉద్దేశం ఏమిటంటే—భోంచేసి—వెన్నెలలో కృష్ణ వొడ్డున గొంతు పోయేవరకూ కబుర్లూ, డ్యూయెట్లూ అరిచేసుకుని-అప్పుడు—కాళ్ళ పీకు తెలియకుండా ఉండగలందులకై పోట్లాటలో దిగి ఆ వేగంలో స్టేషన్ చేరేసుకుని అక్కడే తెల్లవార్చేయడం. ఈ ప్రోగ్రామ్‌లో యికానమీ వుంది. ఇక్కడ డెఫిసిట్ బడ్జెటయితే అప్పు పుట్టదు. బస్ ఛార్జీలు అతి కఠినం. ఐదు పైసలు తక్కువైనా అడుక్కు తెచ్చుకుని చెల్లించవలసిందే. కనుక ఓ బంగారు బొమ్మా బుద్ధిగా నిలుచో కాస్సేపు."

ఛీఛీ అనుకుంది విమల లోలోపల. పైకి అనకపోవడానికి కారణం ఆమె అంతో యింతో పతివ్రత మరి.

ఆర్థిక సమస్య ఆ దంపతుల మధ్య నిశ్శబ్దాన్ని సృష్టించింది. ఆ నిశ్శబ్దంలో అలా ఎన్ని నిముషాలు గడిచాయో వాళ్ళిద్దరిలో ఒక్కరూ లెక్కించలేదు.

హాటాత్తుగా అరిచాడు రంగనాథం- "తెలుగు దీపం!"

"ఏమిటీ?" త్రుళ్ళిపడి అతనికి దగ్గరగా జరిగిందామె.

"తెలుగు దీపం!"

"తెలుగు దీపమూ, తమిళ దీపమూ ఏదీ ఆ దీపం? పండేమో అనుకుని హడిలిచచ్చాను చీర పాడు చేస్తుందేమో అని! ఇంతకీ ఆ తెలుగు దీపం ఏమిటి? యెక్కడ?"

ఒక్కసారి గంభీరంగా మారిపోయాడు రంగనాథం.

"తెలుగు దీపం! ఆంధ్రప్రదేశ్ నుంచి వెలువడే వార పత్రికలో అది మిన్నా. ఓ రచయిత భార్య వయ్యుండీ యీ మాత్రం తెలుసుకోలేక పోయావు! ఈ అజ్ఞానం నేను క్షమించను. నిన్ను పుట్టింటికి పంపేస్తాను. జ్ఞానం సంపాదించుకురా."

"జ్ఞానం కోసం పుట్టింటికి పంపేస్తారా! అవును. నా కివ్వడాని కది మీ దగ్గర లేదేమో! ఇంతకీ జ్ఞానానికి నానార్థాలుండి అందులో ధనం కూడా ఒకటి కాదు కద? బై ది బై...మీ దగ్గర డబ్బు ఆస్తే లేదన్నారు. మా పుట్టిల్లు, ఇక్కడికి పాతిక రూపాయల దూరం...'

"జీతాల అరియర్స్ అందాక ఆ విషయము ఆలోచిద్దాం. ముందు నడువ్."

"మిమ్మల్ననుసరిస్తానే ఉన్నాను డార్లింగ్. ఇంతకీ యీ పరుగెక్కడికి?"

"తెలుగు దీపం ఆఫీసుకి."

"ఎందుకు?"

"నీ మెదడు కృష్ణలో గిరాటెయ్యా! ఎనిమిది నెలల క్రితం నా కథొకటి వెయ్యలేదూ ఆ పత్రికలో?"

"అయితే?"

"దాని తాలూకు పారితోషికం పంపలేదు."

"కాలదోషం పట్టి పోలేదూ?"

"శుభమా అని బయలుదేరుతూంటే శని పలుకుతావేం? పద పద—"


"మరో కథ పంపించినట్లున్నారప్పుడు. తెలుగు దీపానికేనా?"

"ఆ! బాగా గుర్తు తెచ్చావు. అచ్చులో కథ చూసుకున్న ఉత్సాహంలో మరొకటి—విషవలయం—రాసి పంపాను."

"రెండింటికీ పారితోషికం యిచ్చేస్తే బాగుండును. రెండు సినిమాలు చూసి..."

"అలా లేదు, చూలా లేదని—వేసుకున్న కథకి యిస్తే చాలులెద్దూ. ముందు గండం గడుస్తుంది."

"ఆడజన్మెత్తాను, నాకు ఆలు వుండే అవకాశం లేదు."




"పోన్లే. నాకుంది ఆలి."

"నాకూ వుంది చూలు." మూతి వంకర తిప్పింది విమల.

"షటప్ ... సారీ...గప్ చుప్...పరిసరాలలో ఫ్యామిలీ ప్లానింగ్ వాళ్లుండే ప్రమాదం వుంది."

"బిల్డింగూ అదీ ఘనంగానే వుంది. బాగానే యిస్తారా మీ కథకి?"

"పదో, పరకో..."

"పరక వొద్దు. పాతికడగండి. చీర కొనుక్కుందాం. అదే...చీర కొందురు గాని నాకు."

"బిల్డింగ్ లోపల యింకా ఘనంగా వుంటుంది కానీ అడుగులు వడిగా వెయ్యాలి, హంసగమనా" హెచ్చరించాడు రంగనాథం.

"మీతో సాలలేక హంసలాగే ఎగురుతున్నాను."

ఎడిటర్ గారనీ, సంపాదక మహాశయులనీ అడిగితే ఛ్రాళ్ళెవరూ సమాధానం చెప్పలేదు రంగనాథానికి. ఓ పెద్దమనిషి రంగనాథాన్ని చూసి జాలి పడినట్లు అసలు సూత్రం చెప్పాడు—

"వేదాంతం శాస్త్రిగారెక్కడ అని రెండో అంతస్థులో అడిగితే చెప్తారు. ఆయనే తెలుగు దీపం ఎడిటర్."

రంగనాథం, విమలా రెండో అంతస్థు చేరుకున్నారు. ఎవరో కుర్రాడి నడగగా చిన్నగదిలోకి తీసుకెళ్ళి రెండు కుర్చీలలో కూర్చున్న రెండు శాస్త్రీలలోనూ కళ్ళజోడు కలవాడే కథల మాస్టర్ అని చెప్పి తనదారిన పోయాడు.

"నమస్కారం...నా పేరు రంగనాథం—"

వంచిన తల ఎత్తకుండా "నమస్కారం...మీకేం కావాలి?" అన్నాడు ఎడిటర్ కసురుతున్న ధోరణిలో.

రంగనాథానికి డి. యి. వో. ని చూసినంత భయం వేసింది.

"నేనో చిన్న పనిమీద తమ దర్శనార్థం వచ్చాను."

సవినయంగా, జిల్లాపరిషత్ ఆఫీసు ఎల్. డి. సి. ముందు మల్లె అన్నాడు రంగనాథం.

"ఏమిటది?" కొట్టబోతున్నట్లు తల ఎత్తాడు ఎడిటర్.

"ఎనిమిది నెలల క్రితం నా రచన తమ పత్రికలో ప్రచురించారు."

"అయితే ఏం చెయ్యమంటారు?"

"మీ పత్రికకి మరో రచన—విషవలయం—పంపాను..."

"చూడండి...నాకు టైమ్ చాలా ప్రెషస్. మీ కథ విషయం యిప్పుడు నేనేమీ చెప్పలేను. ఇప్పుడు మేము వేస్తున్నది రెండు సంవత్సరాల క్రితం అందిన కథలు. మీ కథ రెండు మూడేళ్ళలో రావొచ్చు. లేదా—రాకపోనూ వచ్చు."

"అన్ని కథలు..."

"అహా! మా పత్రికకు అన్నేసి కథలు వచ్చేస్తుంటాయ్. వనితావని వ్యాసాలు రెండు గోనె బస్తాలు. కథలు మూడు గోనెలతో...సీరియల్స్ ఓ బస్తాడు... వీటన్నిటి మధ్య మీ కథ వెదకడం నా తరం కాదు. బ్రహ్మతరం కూడా కాదనే ఐ బిలీవ్..."

"వేసుకోలేని కథ అను త్రిప్పి పంపరా?"

"పంపము."

"స్టాంపులు పెట్టినా పంపరా?"

"ఊహుఁ."

"కనీసం కథ ప్రచురించే విషయం కూడా తెలియపరచడం..."

"మాకు అసాధ్యం. ఈ సంపాదకుడి సీటుంది చూశారూ, యిది పది గాడిదల పని. మేనేజ్ మెంటువారు నన్నొక్కడినే వేశారిక్కడ. అందుచేత—మేం కథలు చదవం. చదవలేం. ఎప్పుడవసరం వస్తే అప్పుడు కథల బస్తా దగ్గరకి పరుగెత్తి సంచికకు కావలసిన మేటరు కలక్ట్ చేసుకుంటాం. కథలన్నీ నేరుగా గోనె బస్తాలలోకి వెళ్తాయ్—నాకు చూసేందుకు తీరికుండదు కనుక. వేసుకోని కథ అను త్రిప్పి పంపుతూ కూర్చుండడానికిక్కడ మనుషులు లేరు." ఖచ్చితంగా చెప్పేశాడు వేదాంతం శాస్త్రి.

"మీరు—కథలు చదవరు—తిప్పి పంపరు—ప్రచురించేదీ లేనిదీ చెప్పరు - ప్రచురించాక కాపీ కూడా పంపరు. పారితోషికం యివ్వరు. అయినా మీకు కథలు కోకొల్లలుగా వస్తూంటాయ్!" నమ్మలేనట్లు చూశాడు రంగనాథం.

"నా మాటమీద నమ్మకం లేకపోతే గోడౌన్‌లోకి వెళ్ళి బస్తాలు చూడండి."

"ఎందుకూ? మీ మాటమీద నమ్మకం లేక కాదు... నే నాశ్చర్యపడుతున్నదల్లా తెలుగు రచయిత సహన శక్తిమీద!" కొంచెం ఆవేశం వచ్చింది రంగనాథంలో...ఎంత రచయిత అయినా అతనూ ఓ మనిషే. అతనికి మానావమానాలూ ఆవేశాగ్రహాలూ ఉండటంలో ఆశ్చర్యమూ, అసహజమూ లేవు.

"మానసికంగా, శారీరకంగా శ్రమ తీసుకుని, కాగితాలు, సిరా, కవర్లు, స్టాంపులు- యిన్నిటికోసం డబ్బు తగలేసి చివరకు కథ పంపితే—మీ రా కథ చదవరు. చదివినా ఏ రెండేళ్ళకో చదువుతారు. వేసినా పత్రిక పంపరు! పారితోషికం సంగతి సరేసరి..."

"కథలు రాసేది డబ్బుకోసమా? కళని అపవిత్రం చేస్తారా? తప్పు కాదూ? ఆ మాట కొస్తే కళాకారుడికి కీర్తి కంటె కావలసిందేముంది? మా పత్రిక సర్క్యులేషన్ ముప్ఫయ్ వేలు. అంటే ఆ రచయిత పేరు ముప్ఫయ్ వేలసార్లు ముద్రితమౌతుంది. కనీసం అరవై వేల తెలుగుజనం అతని పేరు చూస్తారు. మా పత్రిక విదేశాలకు కూడా వెళ్తుంది. కాగితాలకూ స్టాంపులకీ మహా అయితే ఓ రూపాయి. ఒక్క రూపాయి...అష్టరాల్ వన్ రుపీతో రచయిత కెంత పేరు! కళాకారుడిగా..."

వొళ్ళు మండిపోయింది రంగనాథానికి. ఎయిర్ కండిషన్డు గది అయినా—అతని వొళ్ళు విజయవాడ వేసవి ఎండలాగా మండిపోయింది.

"కళ!...కథకు పారితోషికం కోరితే కళా ద్రోహం! ఒక్క మాట చెప్పండి... మీ రిక్కడ కూర్చుని కథలను వ్యాప్తం చేస్తున్నారు. కళను ఉద్ధరిస్తున్నారు. సాహిత్యానికి మీరే వెన్నెముకలు. మీరు ఏ ప్రతిఫలమూ కోరకుండానే చేస్తున్నారా యీ కళాసేవ?

"నిజంగా మీరు సాహిత్యసేవ చేయదల్చుకుంటే మీ పత్రికకి వెల ఎందుకుండాలి! ఊరికే పంచిపెట్టండి కావాలన్న వాళ్ళందరికీ.

"పత్రికకు వెల ఉండి—వాటి అమ్మకాలవల్ల లాభాలు సంపాదిస్తూ-పత్రికా ప్రచురణ సాహిత్యోద్ధరణకే అనడంలో న్యాయం ఏమీ లేదు. పత్రిక అమ్మడు పోగా లేని కళాద్రోహం—కథ అమ్మకోడంలో ఏమీ కలుగదు. కథ అచ్చు వేసుకున్నందుకు రచయితకు పారితోషికం పంపాల్సిన విధి మీకుంది. అంతే కాదు—రచయిత తన రచనపట్ల చెందే ఆత్రుత నర్థం చేసుకుని ఆ రచన విష

యంలో మీ నిర్ణయం తెలియపర్చాల్సిన బాధ్యత మీకుంది. ఈ కనీస సభ్యతా సూత్రాలను పాటించకుండా-రచయితల బలహీనత నాధారంగా చేసుకుని డబ్బు సంపాదించుకోడంకంటె మరో ఘోరం ఉండదు."

"పది గాడిదల పని—నా వొక్కడి మీదా పడేసింది మానేజ్‌మెంట్..." ఈసారి కొంచం తగ్గాడు వేదాంతం శాస్త్రి.

"మరో తొమ్మిది గాడిదలను పంపమని చెప్పండి. రచయిత రచనను స్వీకరించడంతోపాటు పారితోషికం పంపవలసి ఉంటుందని కూడా చెప్పండి మానేజ్‌మెంట్‌తో..."

"మీకు మేమేమీ బాకీ లేము. మీ కథ ఇంకా అచ్చు కాలేదుగా?" విజృంభించాడు ఎడిటర్.

"తమరు మరచినట్లున్నారు. నా కథ ఒకటి ఎనిమిది నెలల క్రితం ప్రచురించారు. మరొకటి ఏ గోనె బస్తాలోనో ఉందో, లేక చెదలు తినేశాయో!"

"ప్రచురించిన మీ కథ పేరు?"

"నయనతార... ఎనిమిది నెలలౌతూంది. పత్రికైతే పోస్టులో మిస్సవవొచ్చు.మనియార్డర్లు కూడా అంత..."

"ఆగండి...అందమైన అమ్మాయి, ఓ అబ్బాయి, ఇవి కదూ మీ కథలోని పాత్రలు?"

"అవును."

"రైట్ ... ఇప్పుడు చెప్పండి.... మీరా కథ స్వంతంగానే వ్రాశారా?"

"అ-ంటే?" తెల్లబోయాడు రంగనాథం.

"మేము యువ రచయితలను ప్రోత్సహించే ఉద్దేశంతో కథల క్వాలిటీ అంతగా చూడటంలేదు. ఒప్పుకుంటాను. యువ రచయితలు కనుక పారితోషికం పంపడంలేదు..."

"అదీ అన్యాయమే. యువ రచయిత రచన మాత్రం పత్రిక పేజీలు నింపడం లేదూ? దాని కెందుకుండకూడదు పారితోషికం?"


"ఆ విషయం అలా వుంచండి. అంతో యింతో పేరున్న మీరే కథా చౌర్యం చేసి..."

"నేను కథా చౌర్యం చేశానా! ఏమిటి మీరనేది!" నవనాడులూ కృంగిపోయాయి రంగనాథానికి.

"మీ కథ-ఫలానా కథకు కాపీ అని పన్నెండుత్తరాలు వచ్చాయి. అవి ప్రచురిస్తే మీ పేరూ, ఫ్యూచరూ ఏమౌతాయని జాలిపడి వాటిని ప్రచురించలేదు. కాపీకొట్టిన కథకు పారితోషికంకూడా పంపి కథా చౌర్యాన్ని ప్రోత్సహించడానికి నా మన సంగీకరించలేదు."

రంగనాథం తల ఎత్తుకోలేక పోయాడు.

పరిస్థితి గమనించినట్లు అంది విమల. "పదండి పోదాం. రైలుకి వేళవుతూంది."




సంపాదకుడి దగ్గర శలవు తీసుకోకుండానే కదిలాడు రంగనాథం.

డోర్స్ మూతపడిన అనంతరం వేదాంతంశాస్త్రి ప్రక్క కుర్చీ ఆసామీ ఘొల్లున నవ్వారు.

"అఖండుడివోయ్, శాస్త్రీ! చావు దెబ్బ కొట్టావ్ అంత రచయిత మీదా. అందుకే నీ కంత ఎక్కువ జీతం...పూర్ రైటర్. నాల్రోజులవరకూ తేరుకోలేడు షాక్ ఎఫెక్టు నుంచి."

"లేకపోతే కథకి పారితోషికం కావాలిట! ఇలా అందరికీ పారితోషికం యివ్వడం మొదలుపెడితే మన పత్రికకి దెబ్బ కదూ?"

"ఆఫీసూ, అచ్చు మిషనూ చూపి పంపించాల్సింది. ఇంతకీ ఆ కథ కాపీయేనా?"

"నా మొహం. అంతా హంబగ్."

"మరి అంత ధీమాగా..."

"అది ప్రేమ కథ కదుటయ్యా! ప్రేమా, ప్రేమ కథలూ హిస్టరీలాగా రిపీట్ కావలసిందే తప్ప వాటిలో నావెల్టీ ఉండదు. ప్రస్తుతం వస్తున్న యే ప్రేమ కథనైనా కళ్ళు మూసుకుని ధీమాగా కాపీ అంటే కాదనగలిగే దమ్ములు ఎవరికీ వుండవు. ముఖ్యంగా

రచయితలకసలుండవు."

"బాగుంది నీ ట్రిక్..."

* * *

కృష్ణ వొడ్డున వెన్నెలలో విమల అందంగా వుంది. అంతకంటే పదిరెట్లు కోపంగా వుంది.

"ఇతనొక్కడు తల బిరుసు మనిషిలా వున్నాడు కానీ పత్రికా సంపాదకులు చాలా మర్యాదగా ప్రవర్తిస్తారు. రచయితలకు ప్రతిఫలం పంపినా మానినా, రచయిత వచ్చేసరికి చాలా గౌరవం యిస్తారు. ఎవరూ యితని మల్లె వుండరు..."

"ఆ. రచయితగారంటే ఘనస్వాగతం చెప్తూ ఎదురొస్తారు! మీ మాటలు నమ్మాలి. ఇవాళ తెలుగు దీపం ఆఫీసుకి రాబట్టి తమ బండారం బయట పడింది. ఛీఛీ...అన్ని చివాట్లు తింటూ, మర్యాద పోగొట్టుకుంటూ వెధవ కథలు రాసుకోక పోతేనేం? కడుపునిండేనా, కాలు నిండేనా?"

"నన్నర్థం చేసుకో, విమలా..."

"నో అంటే నో. కాపీ కథల రచయితను నేను వినను."

"నేను కథాచోరుణ్ని కాను, విమలా. కనీసం నువ్వయినా నన్ను విశ్వసించవూ? పారితోషికం ఎగగొట్టడానికి సంపాదకుడా యెత్తు వేసి వుండవచ్చు. లేదా కోయిన్సిడెన్స్ ఆఫ్ మైండ్ అని..." కథలు రాయనివ్వదేమో అన్న బాధ రంగనాథం గొంతులో ప్రస్ఫుటమాతూంది స్పష్టంగా.

"ఇక అటువంటి కబుర్లు వొద్దు" ఖండితంగా అనేసింది విమల.

దీనంగా చూశాడు రంగనాథం.

వెన్నెలలో విమల-కోపంగా వుంది.

వెన్నెలలో విమల-అందంగా వుంది.

"ఏం యిక మీ రచనా వ్యాసంగం కృష్ణలో గిరాటేసినట్లేనా?" యింకెప్పుడూ నేరం చెయ్యవు కదా అని జడ్జి దోషి నడిగినట్లు అడిగింది విమల.

"విమలా, మైడార్లింగ్, ప్లీజ్... నన్ను కథలు రాసుకోనీవూ?"

విమలకు పూర్తిగా కోపం వచ్చేసింది.

"ఇంకా మీరు కథలు వ్రాయదల్చుకుంటే నా ప్రిస్టేజ్ నిలువునా తీయదల్చుకుంటే ఐ కాంట్ టాలరేట్. మిమ్మల్ని పుట్టింటికి పంపేస్తాను పరువు మర్యాదా నేర్చుకు రమ్మని. దట్సాల్."

"వొద్దు విమలా!" బాధగా అన్నాడు రంగనాథం, ఆమెను చూస్తూ వాగ్దానం చేస్తున్నట్లు. "ఇక నిజంగా నేను కథ వ్రాయను."

"దట్స్ నైస్. మంచి హాబీ అలా ఉండాలి. కాశీ వెళ్ళనక్కర లేకుండా, కృష్ణలోనే రచనా వ్యాసంగం వదిలేసి ఇకొనమీ చేసినందుకు కంగ్రాట్స్... ఇక మీరు గౌరవనీయులైన నా భర్త. టేక్ కిస్ నా..."

విమల బుగ్గ అందించగా రంగనాథం ముద్దెట్టుకున్నాడు. జీవితంలో మళ్ళీ కథ రాయలేదు రంగనాథం.